## సింగిల్ పేజీ కథలు

# అనుభూతి

రైలు చిన్నగా శబ్దం చేస్తూ ఆగింది. మురళి, రాధ మెల్లగా రైలు దిగారు.

స్టేషన్ అంతా రద్దీగా ఉంది. రాత్రిపూట లైట్ల వెలుగులో మైసూర్ స్టేషన్ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. రాత్రి తొమ్మిది గంటలు కావస్తున్నది. డిసెంబరు నెల కావడంతో చలిగాలి బాగా వీస్తున్నది.

పోర్టర్ చేతికి రెండు బ్యాగులూ అందించి స్టేషన్ బయటకు వచ్చారు ఇద్దరూ. టాక్సీలో దగ్గరలోని మంచి హోటల్‌కు వెళ్ళారు. ప్రయాణపు అలసటతో వెంటనే స్నానం, భోజనం కానిచ్చి విశ్రాంతి తీసుకున్నారు. మర్నాడు పొద్దున్నే అల్పాహారం కానిచ్చి ఇద్దరూ బయటపడ్డారు. సైట్ సీయింగ్‌కు టాక్సీ మాట్లాడుకున్నారు.

మురళి చాలా ఉత్సాహంగా ఉన్నాడు. రాధతో తన మైసూర్ ప్రయాణం అతనికి ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. రాధ కూడా ఎంతో హుషారుగా ఉంది. ఈ ప్రయాణం ఆమెలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

మైసూర్ మహారాజా ప్యాలేస్ ఎంతో అద్భుతంగా ఉంది. చాముండేశ్వరి టెంపుల్ వారికెంతో నచ్చింది. ప్రకృతి రమణీయ దృశ్యాలతోపాటు, చక్కటి వాతావరణంలో మురళి, రాధ ఆనందంతో పరవశించారు. ఈ టూర్ ఎప్పటికీ మరచిపోలేని అనుభూతులను వారి ఎదనిండా నింపింది.

సాయంత్రం వేళకు ఇద్దరూ బృందావన్ గార్డెన్స్‌కు చేరారు. రాత్రిపూట లైట్ల వెలుగులో ఎంతో అందంగా ఉంది ఆ గార్డెన్. ఎందరో జంటలుగా విహరిస్తున్నారు. వారిలో ఒక జంట అయ్యారు మురళి, రాధ.

రాధ చేతిని మురళి తన చేతిలోకి తీసుకున్నాడు. రాధకు కొంచెం సిగ్గుగా అనిపించినా ఆమెకు కూడా బాగానే అనిపించింది.

హోటల్‌కి చేరేసరికి రాత్రి తొమ్మిది గంటల



యింది. స్నానాలు, భోజనాలు కానిచ్చారు. తల నిండా పూలతో అలంకరించుకొన్న రాధను చూసి మురళి ఆనందాశ్చర్యాలు చెందాడు. ఆమెను ప్రేమగా దగ్గరకు తీసుకొని మంచంపై తన ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు. ఆమె నుదుటిపై సుతారంగా ముద్దుపెట్టాడు.

''ఎలా వుంది మన టూర్'' అడిగాడు మురళి.

''చాలా బాగుందండీ. జీవితంలో మరచిపోలేని అనుభూతి'' అంటూ మంచంపైకి వాలింది రాధ.

''ఏంటీ అప్పుడే పడుకుంటున్నావు. మూడ్ లేదా'' అన్నాడు సరసంగా. ఆమె కాస్త సిగ్గుపడి దగ్గుతూ ప్రక్కకు తిరిగి పడుకుంది.

''ఏంటీ దగ్గు తగ్గలేదా?'' అంటూ ఆందోళనగా లేచాడు మురళి. ''దగ్గుమందు వేసుకున్నావా?''

''లేదండీ. మరచిపోయాను. ఆ బేగ్‌లో మందు కాస్త ఇవ్వండి. అలాగే మీరు కూడా బీపీ టాబ్లెట్ వేసుకోండి'' అంది రాధ అలసటగా.

మెల్లగా మోకాళ్ళు పట్టుకుంటూ లేచాడు మురళి. కళ్ళజోడు పెట్టుకుని దగ్గుమందు రాధకిచ్చి తను బీపీ టాబ్లెట్ వేసుకున్నాడు.

''ఎప్పుడో పెళ్లయిన కొత్తల్లో ఇలా తిరిగామని ఈ అరవై ఏళ్ళ వయసులో కూడా తిరగాలంటే ఓపిక ఉంటుందా?'' అన్నది రాధ నీరసంగా.

''నేను రిటైర్ అయ్యి, పిల్లలందరూ సెటిలై, ఇప్పుడు మనం మళ్ళీ ఒంటరి వాళ్ళమయ్యాం కదా. ఈ ఒంటరితనం మర్చిపోయి పాత రోజులు గుర్తుకు తెచ్చుకోవడం కోసం మళ్ళీ మైసూర్ తీసుకువచ్చాను. పాపం కాస్త నీకు ఇబ్బంది అయ్యిందేమో'' అన్నాడు మురళి ఆప్యాయంగా.

''లేదండీ! మీరు ఆనందంగా వుంటే నాకు అదే చాలు. ఈ ఆరోగ్య సమస్యలు మనకు ఎప్పుడూ వుండేవే. కానీ ఈ అనుభూతులు మర్చిపోలేనివి కదా'' అంటూ ప్రేమగా దగ్గరకు జరిగింది. వారికి మళ్ళీ పాతరోజులను గుర్తుచేసింది ఆ రాత్రి.

**-ఆర్. ఉదయ భాస్కర్** (ముంబయ్)




